క్లుప్తంగా

నేడు అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



విద్యుత్‌దీపాలంకరణలో ఆలయం

చింతపల్లి: స్థానిక ముత్యాలమ్మ ఆలయ 8వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరుగుతుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

నాడు రథంపై.. నేడు బైక్‌పై

- శ్రీకృష్ణుని వేషధారణలో సందడి



బైక్‌పై శ్రీకృష్ణుడు వేషధారణలో స్వామి

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో శ్రీ కృష్ణ వేషధారకుడు బైక్‌పై చక్కర్లు కొట్టటం అందరినీ అలరించింది. జి.మాడుగుల పురవీధుల్లో పలు పాఠశాలలు, దేవాలయాలను, ప్రముఖల ఇళ్లను ఆయన సందర్శించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన మిరియాల స్వామి శ్రీకృష్ణుని వేషధారణలో గ్రామాల్లో తిరుగుతూ జీవనోపాధి కోసం గ్రామ పెద్దల వద్దకు వెళ్లి విరాళాలను సేకరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని రంగిలిసింగి, కుట్టి, గుంటసీమ, బల్లుకట్టు, దాతురు, ఇసుకలు,సోబురు తదితర గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. స్థానిక యువతతో మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో త్రినాథస్వాముల మేళా



పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన త్రినాథ స్వాముల మేళాను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రామం సమక్షంలో త్రినాథస్వాముల విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులతో భక్తులు పాల్గొన్నారు

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మండల కన్వీనర్ రామకృష్ణ

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి గ్రామంలో స్థానిక గిరిసీమ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ ప్రారంభించారు. సర్పంచ్ కొంగర మురళీకృష్ణ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మొదటి మ్యాచ్ జడ్డంగి–ఎర్రంపాడు టీమ్‌ల మధ్య జరిగింది. రవి, కామేష్, సత్తిబాబు, గణపతి, బాబూరావు, ప్రశాంతి, వెంకటరమణ, రాధాకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కుమ్మర్లలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్, గృహ సారథులు



ముసిరి గ్రామంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. అరమ పంచాయతీ ముసిరి, బడిమెల గ్రామాల్లో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గుణ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో 131 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ బాక ఈశ్వరి, వైస్ ఎంపీపీ ఆనందరావు, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, సర్పంచ్‌లు శారద, నాగేశ్వరరావు, ఎంపీటీసీలు పద్మ, విజయ, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, నాయకులు శ్రీరాములు, సింహాచలం, కృష్ణారావు, దిశ మహిళ విభాగ నాయకురాలు లీలారాణి, గ్రామ సచివాయ కన్వీనర్ గణపతి, కన్వీనర్లు దలపతి, తుమ్‌నాథ్, లింగు, గ్రామ సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని శివారు ప్రాంతమైన కుమ్మర్లలో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సచివాలయ కన్వీనర్ నూకరాజు, గృహసారథులు శారద, సత్తిబాబు, గ్రామ వలంటీర్లు, వీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



హుకుంపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతోగానో ఉపయోగపడతాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మొదటిరోజు గిరిజనులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజనులకు అన్నివేళలా అండగా ఉండి సేవలందిస్తానని చెప్పారు. జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమా, మండల కన్వీనర్ కె.రామకృష్ణ, ఎంపిటీసీ మజ్జి హరి, నాయకులు కోటిబాబు, అనిల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయం ముందు రహదారిపై క్యూకట్టిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ క్యూలైన్లతోపాటు ఆలయ ఆవరణ అంతా భక్తులతో కిట కిటలాడింది. అమ్మవారి నెల పండగ పూర్తయినప్పటికీ ఇంత పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఆలయం కళకళలాడింది. క్యూలైన్లు కిక్కిరిసి, ఆలయ ముందు భాగంలో రహదారిపై అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా దేవదాయ శాఖాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. చిన్నారులకు బాలింతలు పాలిచ్చేందుకు అధికారులు ఆలయ ఆవరణలో ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. బాలింతలు, చిన్నారులు కాసేపు సేదతీరారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

కొయ్యూరు: మండలంలోని బాలారం పంచాయతీ మాజీ సర్పంచ్ అప్పన శ్రీరాములు, అతని తమ్ముడు రమణాజీ వర్ధంతిని పాత బలారంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పన శ్రీరాములు జ్ఞాపకార్థం ఆయన తనయుడు ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

అరకులోయ రూరల్: అక్రమ నిర్మాణలపై రెవెన్యూ, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేసినట్టు ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు చట్టు మోహన్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో అరకులోయ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. మన్యంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేయాకూడదనే నిబంధనలున్నా గిరిజనేతరులు గిరిజన హక్కులను కాలరాస్తున్నారన్నారు. అధికారికంగా లాడ్జీలు, రిసార్టులు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

నేడు సత్యనారాయణ స్వామి కల్యాణం

ఎటపాక: మండలంలోని తోటపల్లి గ్రామంలో రమాసహిత సత్యనారాయణ స్వామి వారి కల్యాణం సోమవారం నిర్వహించనున్నారు. ఏటా జరిగే ఈ కల్యాణానికి మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివస్తారు. ఇప్పటికే ఆలయంలో ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం

మాకవరపాలెం: మండలంలోని పి.పి.అగ్రహారం అమృతేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు బ్రహ్మయ్యశర్మ తెలిపారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి వివిధ పూజలు, హోమాలు ప్రారంభిస్తామన్నారు. రాత్రి 8 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేశారా?

- కార్డు పొంది పదేళ్లు పూర్తయితే అప్‌డేట్ చేయించాల్సిందే
- సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు
- సేవలను వినియోగించుకోవాలి



ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించుకుంటున్న లబ్ధిదారులు

అనంతగిరి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు కావాలన్నా... బ్యాంకింగ్ కార్యకలాపాలు కొనసాగించాలన్నా.. సెల్‌ఫోన్ సిమ్‌కార్డులు పొందాలన్నా... ఇలా ఒకటేమిటి ప్రతి అవసరానికి ఇప్పుడు ఆధార్ తప్పసరి. ఇంతటి కీలకమైన ఆధార్‌కార్డు పొంది పదేళ్లు పూర్తయితే ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకునే సమయం ఆసన్నమైంది. ఆధార్ కార్డు తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని లేకుంటే ఆగస్టు నెలతో ఆధార్‌కార్డులు పనిచేయదని ప్రభుత్వం చెబుతోంది.

ఉచితంగా ఆధార్ అప్‌డేట్

ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన పనిలేదు. ఈ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ఈనెల 15 నుంచి అప్‌డేట్ ప్రక్రియను ప్రారంభించింది. జూన్ వరకు మూడు నెలలపాటు ఉచితంగా వైబ్‌సైట్ ద్వారా గానీ, మొబైల్‌లో ఎం ఆధార్ యాప్‌లోనైనా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. అరచేతిలోనే ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పించింది. బ్యాంకులు, సాధారణ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో కూడా ఆధార్ ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలందిస్తున్నారు. .

గుర్తింపు పత్రం జతచేయాలి

కొన్నిసార్లు వ్యక్తిగత వివరాలున్న ధ్రువపత్రాలు సమర్పించకపోయినా కేవలం ఒక దరఖాస్తుతో అప్పట్లో ఆధార్‌కార్డులు మంజూరు చేశారు. అలాంటి వారితో పాటుగా కార్డు పొంది పదేళ్ల దాటిన వారు తప్పకుండా గుర్తింపుపత్రాలు, ఇతర ధ్రువపత్రాలు ఆధార్‌కార్డు జతచేసి దరఖాస్తులను అప్‌డేషన్ చేసుకోవాలి. లేని పక్షంలో ఈ ఏడాది ఆగస్టు 31తరువాత కార్డు చెల్లుబాటులో ఉండదని అధికారులు చెబుతున్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం ..ప్రస్తుతం అప్‌డేషన్‌లో భాగంగా ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను మార్చుకోవచ్చు. ప్రభుత్వం ఆమోదించిన తరువాత పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లెసెన్స్, ఓటర్ ఐడీ, పాన్‌కార్డు, బ్యాంక్/పోస్టల్ పాస్‌బుక్, ఆయుష్మాన్ భారత్‌కార్డు, గుర్తింపు పొందిన విద్యాసంస్థలు జారీచేసిన పత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపుకార్డులు తదితర 13 రకాల ధువపత్రాలు ద్వారా ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవచ్చు.

సచివాలయాల్లోనూ అప్‌డేట్



ప్రతి ఒక్కరు తమ ఆధార్‌కార్డులను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్‌కార్డు పొందిన పదేళ్ల కాలంలోని ఎప్పుడైనా డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకున్న వారికి ఫర్వాలేదు. మిగిలిన వారు మాత్రం అప్‌డేట్ చేసుకోవాలి. సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఏ.వి.వి.కుమార్ అనంతగిరి ఎంపీడీవో

వీరబ్రహ్మేంద్రునికి ప్రత్యేక పూజలు



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో భక్తులు స్వామి ఆలయానికి చేరుకుని పొలాల్లో పండిన పండ్లను స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

పైడితల్లమ్మ ఆలయానికి విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న ఆలయ నిర్మాణ కమిటీ నాయకులు

రాంబిల్లి: మామిడివాడ పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఆదివారం విరాళాలు సేకరించారు. చినకలవలాపల్లికి చెందిన కలవలపల్లి గణేష్ రూ.50 వేలు, మామిడివాడకు చెందిన పప్పల నానాజీ రూ.10వేలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు నెట్టెం సత్యన్నారాయణ, కన్నం రమణారావు, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏకలవ్య ప్రవేశ పరీక్ష



చింతపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



రాజవొమ్మంగిలో పరీక్ష రాస్తున్న చిన్నారులు

చింతపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఏకలవ్య ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. చింతపల్లిలోని వైటీసీ, ఏపీఆర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 1162 మంది హాజరైనట్టు డీవో రామోహన్‌రావు తెలిపారు. 6వ తరగతితో పాటు 7, 8 తరగతులలో ఖాళీలను భర్తి చేసేందుకు పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అర్హత సాధించిన వారికి ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

రాజవొమ్మంగి: రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఏకలవ్య (ఈఎంఆర్ఎస్ మోడల్ స్కూల్) పాఠశాల ప్రవేశ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. రంపచోడవరంలో రెండు, చింతూరులో రెండు, రాజవొమ్మంగిలో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ప్రవేశ పరీక్షకు 2,178 మంది దరఖాస్తు చేసుకోగా 1349 మంది విద్యార్థులు హాజరైనట్టు గురుకుల సంస్థ కన్వీనర్ / మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జి.కిషోర్ బాబు తెలిపారు. 829 మంది గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్‌కు చెంది 7వ తరగతిలో ప్రవేశానికి 171 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 26 మంది గైర్హాజరయ్యారని, 8వ తరగతి ప్రవేశానికి 110 మంది దరఖాస్తు చేసుకొని 31 పరీక్షలకు రాలేదన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి 60 మంది దరఖాస్తు చేసుకోగా ముగ్గురు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి–235 మంది, 7వ తరగతిలో ప్రవేశానికి–ఐదుగురు, 8, 9వ తరగతుల్లో ప్రవేశానికి ఒక్కొక్కరు చొప్పున పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాశారని కిషోర్‌బాబు చెప్పారు.



ఏకలవ్య పాఠశాలల కన్వీనర్ డాక్టర్ కిషోర్‌బాబు

కోళ్ల వ్యర్థాలతో దుర్గంధం



బల్లుగుడ రోడ్డు పక్కన పడేసిన కోళ్ల వ్యర్థాలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు–పాడేరు ప్రధాన రోడ్డు పక్కన బల్లుగుడ గ్రామ సమీపంలోని రహదారి పక్కన కోళ్ల వ్యర్థాలు దర్శనమిచ్చాయి. మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారులు వచ్చి ఈ ప్రాంతంలో కోళ్ల వ్యర్థాలను పడేశారని తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. గతంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందంటున్నారు. కోళ్ల వ్యర్థాలు, కుళ్లిన ఇతరత్రా చెత్తను పూడ్చకుండా రహదారి పక్కనే పడేయడంతో ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

తగ్గిన జీడిమామిడి ధర



జీడిమామిడి పిక్కలు

రాజవొమ్మంగి: జీడిమామిడి గిట్టుబాటు ధర ప్రస్తుతం తగ్గింది. ధర లభించక రైతులు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక మార్కెట్‌లో జీడిపిక్కల ప్రారంభ ధర బస్తా (80 కిలోలు) రూ. 8,400లకు (కిలో రూ.105) వరకు పలికింది. ఆ ధర క్రమేపీ రూ. 6,400లకు (కిలో ధర రూ.80)కు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా గణనీయంగా పడిపోయింది. తొలిదశలో పూత ఆశాజనకంగా ఉన్నా మంచు ప్రభావానికి పూత మాడిపోయి, పిందెలు నేల రాలిపోయాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 5 నుంచి 6 బస్తాలు ఆశించగా ప్రస్తుతం రెండు బస్తాలు ఉందని వాపోతున్నారు. పిక్కలు కోతకు వచ్చిన సమయంలోనే భారీ వర్షాలు కురవడం కూడా జీడిమామిడి ధర పతనానికి మరో కారణమైందని చెబుతున్నారు. పిక్కలో తేమ చేరిందని, పిక్కలు నల్లగా మారాయని, పిక్కలపై మచ్చలు వచ్చాయని వ్యాపారులు, దళారులు ధరను బాగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జీడిమామిడి పంటకు గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

చప్టా బాగుచేయరూ..



పాడైన లోలెవెల్ చప్టా

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము నుంచి నెల్లిమెట్ల, లబ్బర్తి, లాగరాయి, కింద్ర, కొత్త కింద్ర, కిర్రాబు, తాళ్లపాలెం, బోయపాడు తదితర గ్రామాలను కలిపే రింగ్ రోడ్డుపై గల లోలెవెల్ చప్టా రోజు రోజుకు బీటలు వారి ఛిద్రమౌతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల్లిమెట్ల వద్ద గల చిన్నేరు దాటేందుకు ఈ చప్టా ఆధారమని, పాడైతే అనేక గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఈ చప్టా పాడుకాకుండా చూడాలని, ఆదిలోనే మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో జ్ఞాన మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



జ్ఞాన మల్లేశ్వరునికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు: గొండుపాలెంలో జ్ఞాన మల్లేశ్వర స్వామి 15వ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ స్వామివారి ఆలయానికి ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చినదొర, బండారు చినదొర, రాంబాబు, అప్పలపాత్రుడు, రామన్నపాత్రుడు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



తేగాడలో దుర్గాదేవి అమ్మవారికి పూజలు

కోటకోట : మండలంలోని తేగాడ గ్రామంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించి ఆలయ అర్చకులు నగిరెడ్డి మంగ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

బాలసదనంలో ప్రవేశాలకు దరఖాస్తులు

కోటకోట : స్థానిక బాల సదనంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంటు శశికళ తెలిపారు. అనాథలు, తల్లి గాని, తండ్రిగాని లేని అనాథలు, పేదలు ప్రవేశానికి అర్హులన్నారు. 33 సీట్లు ఉన్నాయని, ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు సూపరింటెండెంట్, బాల సదనం,కోటకోట చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.